

సోమశిలలో 53.967 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 53.967 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కాలువలకు 1100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.90,600
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,216
3 శాతం జీఎస్టీతో	రూ.8,462
సవర (8 గ్రా)	రూ.67,696

గరిష్టం/కనిష్టం
36.1 /25.4

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 61 శాతంగా నమోదైంది.



న్యూస్‌రీల్

డీసీపల్లిలో 563 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 563 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 603 బేళ్ల రాగా 563 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260 లభించింది. సగటు ధర రూ.274.20గా నమోదైంది. వేలంలో 75,196 కిలోల పొగాకును విక్రయించగా రూ.20618965.20 వ్యాపారం జరిగింది. వేలంలో 9 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌పై వీఎస్‌యూ అధికారుల విచారణ

కావలి: పట్టణంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కేంద్రంలో పనిచేస్తున్న సహాయ ప్రొఫెసర్ పి.గోపికృష్ణపై తీరుపై వీఎస్‌యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. పీజీ సెంటర్‌లో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులను గోపీకృష్ణ అనేక రకాలుగా వేధిస్తున్నాడని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఐదుగురు సభ్యులతో కూడిన వర్సిటీ అధికారులు విచారణ చేశారు. విద్యార్థులు, మహిళ అధ్యాపకులు, విద్యార్థినుల విచారించి వీడియో రికార్డు చేశారు.

చివరి దశకు ఇంటర్ పరీక్షల మూల్యాంకనం



అధ్యాపకులకు సూచనలిస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం చివరి అంకానికి చేరింది. బుధవారం నుంచి బాటని, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల ప్రశ్నపత్రాల మూల్యాంకనం ప్రారంభించినట్లు ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం నిర్వహించే అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టుల మూ ల్యాంకనం పూర్తనట్లు చెప్పారు. మిగిలిన సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనాన్ని వచ్చే నెల తొలి వారంలో పూర్తి కానున్నట్లు పేర్కొన్నారు. మూల్యాంకనంలో 1200 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నట్లు తెలిపారు.

వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఫేజ్–2కు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రాధాన్యత క్రమం వెబ్ ఆప్షన్స్ ద్వారా నమోదు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారిణి కె.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు https:// mdfc. apcfss. in, https:// jnanabhumi. ap. gov. in వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 28వ తేదీ చివరి గడువని తెలిపారు. ఇతర వివరాలకు 95816 30003 నంబరులో సంప్రదించాలని సూచించారు.

దమ్ముంటే ఆపండ్రా!

కావలిలో పేట్రేగుతున్న గ్రావెల్ మాఫియా

కావలి నియోజకవర్గం గ్రావెల్ మాఫియాకు అడ్డాగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కనుసన్నల్లో టీడీపీ నేతలు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. దగదర్తి, కావలి, అల్లూరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్, అటవీశాఖ భూముల్లో భారీ యంత్రాలు పెట్టి గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తున్నారు. దగదర్తి మండలం దామవరం వద్ద ఎయిర్‌పోర్ట్‌కు కేటాయించిన భూములు, పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లోనూ గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. చెరువు పోరంబోకు భూములు, మేత పోరంబోకు భూములు అయితే తవ్వకాల కారణంగా స్వరూపం కోల్పోతున్నాయి.

- ఎమ్మెల్యే దగుమాటి కనుసన్నల్లో రేయింబవళ్లు తవ్వకాలు
- ప్రభుత్వ, అటవీ భూముల్లో సైతం..
- రోజూ 200 టిప్పర్లతో అక్రమ రవాణా
- ప్రతి వాహనం నుంచి ప్రజాప్రతినిధికి వాటా
- పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు నెలవారీ మామూళ్లు



ఉలవపాళ్ల సమీపంలో గని మాదిరిగా తవ్వేస్తున్న గ్రావెల్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కావలి, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లో నాణ్యమైన గ్రావెల్ ఖనిజం విస్తారంగా ఉంది. గ్రావెల్ తవ్వకాలకు మండలానికి ఒక మాఫియా లీడర్‌ను పెట్టుకుని స్వయంగా ఎమ్మెల్యే దగుమాటి గ్రావెల్ దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దగమాటి ఎమ్మెల్యే కాక ముందే జలదంకి మండలం అన్నవరం క్వారీల నుంచి అక్రమంగా కంకర రవాణాలో చేయడంలో అనుభవం ఉండడంతో ఆ అనుభవంతోనే విలువైన సహజ ఖనిజ (గ్రావెల్) సంపదను కొల్లగొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. హైవే అంచులు మెరక చేసేందుకు, లేఅవుట్ల ఏర్పాటుకు, ఇతర వాణిజ్య అవసరాలకు గ్రావెల్ తరలించేందుకు రాత్రి పగలూ తేడా లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు.

అందరి నోర్లు నొక్కి.. హైవే ఎక్కి..

గ్రావెల్ అక్రమంగా తవ్వి తరలించేందుకు ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ముందుగానే ఒప్పందాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన లోకల్ నాయకులు స్థానిక అవసరాల కోసం గ్రావెల్ తరలించుకునేలా, ఎమ్మెల్యే కనుసన్నల్లో ఆయన అనుచరులు బరి తెగించి సహజ వనరుల దోపిడీ చేస్తున్నారు. చెరువు పోరంబోకు భూముల్లో లోకల్ నాయకులు తవ్వుకుంటుంటే, హైవేకు దగ్గరగా ఉండే ప్రభుత్వ, ప్రైవేట్, అటవీ భూముల్లో ఎమ్మెల్యే అనుచరులు తవ్వుకుంటున్నారు. కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడిగా వ్యవహరిస్తున్న కీలక నాయకుడు గ్రావెల్ తలింపులో కీలకంగా మారాడు. అక్రమ తవ్వకాలను ఆర్గనైజ్ చేస్తూ గ్రామాలను గుల్లగుల్లగా మార్చేస్తున్నారు. కావలి మండలం రుద్రకోట, బుడమగుంట, ముసునూరు, గౌరవరం, బోగోలు మండలం ముంగమూరు, కొండబిట్రగుంట, పాతబిట్రగుంట, కడనూతల, కోవూరుపల్లి, బోగోలు, కప్పరాళ్లతిప్ప, దగదర్తి మండలం ఉలవపాళ్ల, దామవరం, సున్నపుబట్టి, కౌరుగుంట, అల్లూరు మండలం నార్త్‌ఆములూరు, తదితర ప్రాంతాల్లో ప్రతి రోజూ హిటాచీలు, జేసీబీలు, టిప్పర్లు వినియోగించి తవ్వకాలు సాగిస్తున్నారు. తవ్వకాలపై స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నెలవారీ మామూళ్లతో అధికారులు మౌనముద్ర వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

గగ్గోలు పెడుతున్న గ్రామస్తులు

ఊర్ల చుట్టూ ఉద్యమంగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఊరి చుట్టూ తవ్వకాలు చేస్తుండడంతో పచ్చిగడ్డి కూడా మొలవడం లేదని, పశుగ్రాసం కోసం మూగ జీవాలు కూడా ఇబ్బంది పడుతున్నాయని వాపోతున్నారు. గేదెలను చెరువులోకి తోలుకు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా చెరువుల్లో రెండు నిలువు లోతులో గ్రావెల్ తవ్వేస్తున్నారని మండి పడుతున్నారు. దీంతో పశుపోషణ కూడా కష్టంగా మారి మూగజీవాలను కబేళాలకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లల్లో దందా

మైనింగ్ అధికారులు లెక్కల ప్రకారం చూస్తే ఎకరా భూమిలో మీటరు లోతున తవ్వకాలు జరిపితే 4 వేల ఘనపు మీటర్ల ఖనిజం (గ్రావెల్) వెలువడుతోంది. టిప్పర్‌కు నిండుగా నింపితే 12 క్యూబిక్ మీటర్లు పడుతుంది. అంటే ఎకరాకు 400 టిప్పర్లు గ్రావెల్ వస్తుంది. ఈ లెక్కన ఎకరాకు 4,800 క్యూబిక్ మీటర్లు రవాణా సాగుతోంది. టిప్పర్‌కు రూ.10 వేలు వంతున లెక్క పెడితే ఎకరాలో రూ.4 కోట్ల వరకు వస్తుంది. ఇది ఎకరా భూమిలో మీటరు లోతు తవ్వకాలు చేస్తే మరి పదిహేను మీటర్ల లోతు తీస్తే రూ.కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. కావలి నియోజకవర్గంలో దాదాపు వందల ఎకరాల్లో గ్రావెల్ దందా నడుస్తోంది.





అల్లూరు మండలం నార్త్ ఆములూరులో ఉదయం సమయంలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

ఇది కావలి నియోజకవర్గం అల్లూరు మండలం నార్తుఆములూరులో జరుగుతున్న గ్రావెల్ దందా. ఇక్కడ నుంచి రోజుకు వంద టిప్పర్లకుపైగా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే టీడీపీ నేతలు రాత్రి, పగలు తేడా లేకుండానే గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం టిప్పర్ రూ.10 వేల వరకు పలుకుతోంది. ఈ లెక్కన నిత్యం రూ.2 కోట్ల వరకు గ్రావెల్ వ్యాపారం జరుగుతోంది.



ఉలవపాళ్లలో భారీ యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ఇది దగదర్తి మండలం ఉలవపాళ్లలో జరుగుతున్న గ్రావెల్ దందా..టీడీపీ నేత భారీయంత్రాలు ఉపయోగించి తవ్వకాలు చేయిస్తున్నారు. రోజువారీగా దాదాపు 500 టిప్పలు వరకు గ్రావెల్ తరలించేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేసి గ్రావెల్ తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు.. స్థానికులు అడ్డు చెపితే మాత్రం కేసుల పేరుతో బెదిరిస్తున్నారు.

గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు

నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ రవాణా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కనుసన్నల్లోనే జరుగుతోంది. కొందరు అనుచరుల ద్వారా గ్రావెల్ రవాణాకు ఎక్కడా అవాంతరాలు రాకుండా ఉండేలా చేసుకున్నాడు. గ్రావెల్ దందాను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయిస్తున్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా పోలీసు, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలు చేతులు ముడుచుకుని ఉండి పోయాయి. కావలి సేవకుడిని అంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్న ఎమ్మెల్యే గ్రావెల్ దందాతో సహజ వనరులను కొల్లగొడుతున్నారు.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కావలి

కాకాణి ఇంటి వద్ద హైటెన్షన్

- ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు
- భారీగా చేరుకున్న నేతలు, కార్యకర్తలు
- ముఖ్య నేతలతో భేటీ
- ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ వర్గాల నిఘా



తన నివాసంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసం వద్ద హై టెన్షన్ వాతావరణం నెలకొంది. కాకాణిని ఏక్షణమైనా అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయనే ఉద్దేశంతో ఆయన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి నుంచి అక్కడే ఉన్నారు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ముఖ్య నేతలు సైతం ఆయన నివాసానికి చేరుకుని జరగబోయే పరిణామాలపై చర్చిస్తున్నారు. మరో వైపు ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సైతం ఆయన నివాసం, పార్టీ జిల్లా కార్యాలయం వద్దనే ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి ఉన్నతాధికారుల సమాచారాన్ని అందిస్తున్నారు. పొదలకూరు మండలం తాడిపత్రి సమీపంలో రుస్తుం మైన్స్‌లో లీజు ముగిసినా అక్రమంగా రూ.250 కోట్ల తెల్ల రాయిని దోచేశారంటూ మైనింగ్‌పై పచ్చమీడియా కల్పిత కథనాలు వండి వారుస్తోంది. మరో వైపు మైనింగ్ శాఖాధికారులు సుమారు 60 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్ అక్రమంగా తరలిపోయినట్లు పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో పది మందిపై కేసు పెట్టారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఏ–4 గా ఉన్నారు. అయితే ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఆ రిమాండ్ రిపోర్టులో రూ.7 కోట్లుగా చూపించారు. ఈ క్రమంలో కాకాణిని ఏ క్షణంలోనైనా అరెస్ట్ చేస్తారంటూ రెండు రోజుల నుంచి విస్తృత స్థాయిలో ప్రచారం జరుగుతోంది. దీంతో సర్వేపల్లి నియోజకవర్గంలోని కాకాణి అనుచరులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఇంటి వద్ద భారీ సంఖ్యలో చేరుకున్నారు. నాయకులు, కార్యకర్తలు రాత్రి నుంచి కాకాణి నివాసం వద్దే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయ్ కుమార్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీ కాకాణితో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున అనుచరులు, నాయకులు, కార్యకర్తలు ఉండడంతో పోలీసులు కాకాణిని అరెస్ట్ చేసేందుకు వెళితే గట్టి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. కాకాణికి సంఘీభావంగా మరికొంత మంది నాయకులు ఆయన నివాసానికి చేరుకుని ఆయనతో చర్చించారు. నెల్లూరులో ఏ క్షణం ఏం జరుగుతుందోనని తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



కాకాణి నివాసంలో కార్యకర్తలు

గోడౌన్‌లో భారీగా రేషన్ బియ్యం మాయం

- 1450 బస్తాలు గల్లంతైనట్లు ప్రచారం
- పౌరసరఫరాల సంస్థ జీఎం అర్జునరావు లేదని బుకాయింపు
- విచారణ చేస్తున్నట్లు కావలి ఆర్డీఓ వంశీకృష్ణ వెల్లడి

కావలి: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ గోడౌన్‌లో నిల్వ ఉన్న రేషన్ బియ్యం భారీ స్థాయిలో గల్లంతైనట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. సుమారు 1,450 బియ్యం బస్తాలు మాయమైనట్లుగా తెలుస్తోంది. అయితే ఎన్ని బస్తాలు, ఎన్ని టన్నులనే విషయంలో స్పష్టత లేదు. ఈ విషయం జాయింట్ కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన కావలి ఆర్డీఓ వంశీకృష్ణను విచారణ చేయమని ఆదేశించారు. దీంతో కావలి పట్టణంలోని మద్దూరుపాడులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఉన్న పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌లో బుధవారం తనిఖీలు చేశారు. కాగా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అర్జునరావును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా కావలిలోని తమ గోడౌన్‌లో రేషన్ బియ్యం బస్తాలు మాయం కాలేదంటూ బుకాయించారు. గోడౌన్‌లో విధులు నిర్వహించే డిప్యూటీ తహసీల్దార్ వి.జగదీష్‌బాబును సంప్రదించగా రికార్డుల ప్రకారం ఎంత స్టాక్ ఉండాలో అంతే ఉందని చెప్పారు. కావలి ఆర్డీఓ ఎం.సన్నీ వంశీకృష్ణను సంప్రదించగా రేషన్ బియ్యం బస్తాలు ఎంత మోతాదులో మాయమయ్యాయి, ఎలా జరిగింది, ఎప్పుడనే విషయాలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

డీఎస్‌ఓగా విజయ్‌కుమార్

నెల్లూరు (పొగతోట): జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిగా ఎస్.విజయ్ కుమార్‌ను నియమిస్తూ ఆశాఖాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న విజయ్‌కుమార్ (డిప్యూటీ కలెక్టర్ హోదా)ను డీఎస్‌ఓగా నియమించారు.

బొగ్గు వ్యాగన్ నుంచి మంటలు

- అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది
- రూ.30 వేల నష్టం

మనుబోలు: రైల్వేస్టేషన్ యార్డులో ఆగి ఉన్న బొగ్గు గూడ్స్ వ్యాగన్ నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో స్టేషన్ మాస్టర్ అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను ఆర్పి వేశారు. ఈ ఘటన బుధవారం మనుబోలు మండలంలోని కొమ్మలపూడి రైల్వేస్టేషన్‌లో జరిగింది. అగ్నిమాపక సిబ్బంది కథనం మేరకు.. కృష్ణపట్నం పోర్టు నుంచి చెన్నైకు బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు కొమ్మలపూడి స్టేషన్ వద్ద సిగ్నల్ లేకపోవడంతో ఆగింది. ఈ సమయంలో ఎండ తీవ్రత, బొగ్గు మధ్య ఒత్తిడి కారణంగా ఓ వ్యాగన్ నుంచి పొగలు రావడం గమనించిన స్టేషన్ మాస్టర్ రాజేంద్రభగత్ వెంటనే గూడూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన కొమ్మలపూడి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని వ్యాగన్‌లో మంటలను ఆర్పి అదుపు చేశారు. బొగ్గు వ్యాగన్‌లో పాక్షికంగా కాలిపోవడంతో సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఫైర్‌మాన్‌లు సంపత్‌కుమార్, ప్రదీప్, శ్రీహరి తదతరులున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాకర్ల సమక్షంలో తమ్ముళ్ల తన్నులాట

ఉదయగిరి: ఉదయగిరి టీడీపీలో అంతర్గత విభేదాలు ముదిరాయి. తమ్ముళ్లు ఏకంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలోనే తన్నులాడుకున్నారు. స్థానిక మండ పరిషత్ కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి బుధవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వచ్చారు. ఈ సమయంలో టీడీపీ మండల నేత మట్ల లక్ష్మయ్య కోడలైన ఎంపీపీ మట్ల శాంతి కూడా పాల్గొన్నారు. ఈ క్రమంలో మీడియా ఫొటోలు తీసుకునే సమయంలో మాజీ జెడ్పీ వైర్మన్ చెంచలబాబుయాదవ్ మట్ల శాంతి పక్కన ఎమ్మెల్యే వద్ద నిలబడ్డాడు. దీంతో శాంతి వెనక్కి జరగాల్సి వచ్చింది. ఈ క్రమంలో మట్ల లక్ష్మయ్య చెంచలబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడారు. చెంచలబాబు, పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, మైనార్టీ నేత రియాజ్ లక్ష్మయ్యపై ఘాటుగా స్పందించారు. పరిస్థితి ఉద్రిక్తతగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని లక్ష్మయ్యను పక్కకు లాక్కెళ్లారు. ఆయన పోలీసులను పక్కకు నెట్టేశారు. పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ లక్ష్మయ్యకు సర్ది చెప్పి మండల సమావేశానికి బయలు దేరారు. ఈ క్రమంలో లక్ష్మయ్య రెచ్చగొట్టే విధంగా మాట్లాడంతో సీఐ సీరియస్ కావడంతో పరిస్థితి సద్దుమణిగింది. సాయంత్రం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించే క్రమంలో ఉదయం జరిగిన ఘటన వ్యవహారంపై మరోసారి చెలరేగింది. దీంతో మట్ల లక్ష్మయ్య, చెంచలబాబు వర్గీయులకు మధ్య గొడవ జరిగింది. లక్ష్మయ్యపై మరో టీడీపీ నేత నల్లిపోగు రాజా చేయికున్నారు. దీంతో పరిస్థితి చేయిదాటిపోవడంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని లక్ష్మయ్య బ్రదర్స్‌తో మాట్లాడి సర్దుబాటు చేశారు.



లక్ష్మయ్యను బయటకు తీసుకెళుతున్న పోలీసులు

నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం

రంగస్థల వెలుగులు మాయం

- నాటక రంగంలో పొదలకూరుకు ఘన చరిత్ర
- మారిన పరిస్థితులతో తెరమరుగు
- ఒకప్పటి పౌరాణిక నట దిగ్గజం బాబూరావు
- ప్రస్తుతం పురోహితుడిగా జీవనం

కాలం మారింది. ప్రేక్షకుల అభిరుచులు మారిపోయాయి. పౌరాణిక, సాంఘిక నాటకాలకు ఆదరణ తగ్గిపోయింది. స్మార్ట్ ఫోన్ల యుగంలో ఉన్న ఇప్పటి పిల్లలకు వాటి గురించి పెద్దగా తెలియదు. గతంలో పల్లెవాసులు నాటకాలను తిలకించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లేవారు. నటులకు అరుదైన గౌరవ మర్యాదలు దక్కేవి. కళాకారులకు వీక్షకుల చప్పట్లే కొండంత బలం. అయితే అది ప్రస్తుతం లేకుండాపోయింది. నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


చింతామణి నాటకంలో భవానీశంకర్‌గా బాబూరావు (ఫైల్)


సత్యహరిశ్చంద్ర నాటకం (ఫైల్)


సాంఘిక నాటకం (ఫైల్)

పొదలకూరు: టీవీ, సినిమా, వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు, లైవ్ షోవ్‌లు నేడు రాజ్యమేలుతున్నాయి. కానీ ఒకప్పుడు నాటక రంగం ప్రజలను కొత్త లోకంలోకి తీసుకెళ్లింది. దేశంలో ఏ భాషలో లేని పద్య నాటకాలు మన తెలుగులోనే ఉన్నాయి. పౌరాణిక నాటకంలో నటుల హావభావాలు, కంఠస్త పద్యాలు ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. కాలక్రమేణా నాటక రంగం కుదేలైంది. ఆడేవారు లేక, చూసే వారు రాక నిరాదరణకు గురై కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది.

నటనే శ్వాసగా..

పొదలకూరు పట్టణంలో 1976లో అభ్యుదయ కళా సమితిని స్థాపించారు. ఇందులో ఎందరో నటులు సాంఘిక నాటకాలను ఆడి పేరు సంపాదించారు. ఆ నాటకాలను చూసేందుకు సినీ నిర్మాతలు, దర్శకులు, నటులు పొదలకూరుకు వచ్చేవారు. కాలక్రమంలో నటులు కాలం చేయడం, ఉన్న వారు వృద్ధాప్యంతో నాటకాలు ఆడలేకపోవడంతో సమితి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇక్కడి నుంచి వచ్చిన వారిలో ఒకరు బాబూరావు. పౌరాణిక నాటకాల్లో ఆయను మంచి పేరుంది. సుమారు 1,500 పైగా నాటకాలాడారు. బిరదవోలు గ్రామానికి చెందిన గాది సుధాకర్‌బాబు(బాబూరావు) తన నటాభిలాషను పాఠశాల స్థాయి నుంచే పెంచుకున్నారు. 1984లో శ్రీనివాసులు అనే గురువు వద్ద సత్యహరిశ్చంద్ర నాటకంలో నక్షత్రకుడి పాత్ర ద్వారా పరిచయమయ్యారు. అప్పటి నుంచి అభినవ నక్షత్రకునిగా పేరు తెచ్చుకున్నారు. కళా సమితి బి.సంజీవరావు, వీవీ రమణయ్య యాదవ్ ట్రూపులో చేరి నాటకాలాడేవారు. అభినవ గోపాలరావు అనే బిరుదును కూడా నక్షత్రకుని పాత్ర ద్వారా సొంతం చేసుకున్నారు. బాలనాగమ్మలో బాలవర్ధిగా, గయోపాఖ్యానం యుద్ధ సీనులో శ్రీకృష్ణుడిగా, చింతామణి నాటకంలో భవానీశంకర్ పాత్రలను పోషించారు.

ఆదరణ లేక..

నాటక రంగానికి ఆదరణ తగ్గిపోవడంతో నటులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లారు. బాబూరావు పౌరోహిత్యం చేసుకుంటున్నారు. కళారంగానికి ఆయన ఎంత సేవ చేసినా చివరకు జీవనం కష్టంగా మారడంతో తన సొంత గ్రామంలో దేవాలయాల అర్చకుడిగా కాలం వెళ్లదీస్తున్నారు. సాంఘిక నాటక రంగంలో దిగ్గజంగా పేరున్న విశ్రాంత ఉపాధ్యాయుడు కె.కోటేశ్వరరావు వ్యవసాయం వైపు దృష్టి సారించారు. పొదలకూరులో అభ్యుదయ కళా సమితికి చెందిన కోటేశ్వరరావు, బాబూరావుతోపాటు వ్యవస్థాపకులు బొల్లినేని గోపాలకృష్ణయ్య, వీవీ రమణయ్య యాదవ్, చిల్లర సుబ్బారావు, చిట్టేటి మీరయ్య, కైతేపల్లి రమణయ్య, సింగ్ తదితరులు ఉండేవారు.

నాటకాలంటే పిచ్చి



నాటకాలంటే పిచ్చి. దశాబ్దాలు నాటకాలు ఆడినా పూట గడవడం కష్టంగా మారింది. ఆ రంగాన్ని ఆదరించే వారు లేకపోవడంతో కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నా. ఇప్పటికీ అడపాదడపా నాటకాలాడే ఓపిక ఉంది.

– బాబూరావు, నటుడు, బిరదవోలు

ఆదరణ లేదు



నాటక రంగానికి ఆదరణ కరువైంది. సాంఘిక, పౌరాణిక నాటకాలు ఆడేవాడిని. ఎన్నో అవార్డులు కూడా తీసుకున్నా. టీవీ షోలు, కామిడీ పేరుతో జుగుప్సాకరమైన షోలు తిలకించేందుకే కొందరు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటి తరానికి నాటక రంగం గురించి తెలియకపోవడం విచారకరం.

– కె.కోటేశ్వరరావు, రంగస్థల నటుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు, పొదలకూరు

క్లుప్తంగా

జీతాల కోసం ఎదురుచూపులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో చిరుద్యోగులు జీతాల కోసం ఏడునెలలుగా ఎదురు చూస్తున్నారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా వారికి వేతనాలు అందడం లేదు. ఆ సంస్థలో 10 నుంచి 15 సంవత్సరాలుగా 25 మంది కోచ్‌లు, ఆఫీస్ సబార్డినేట్లుగా, గ్రౌండ్స్ మెన్‌గా, ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నారు. వీరు గతంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేవారు. ఆ సమయంలో సకాలంలో జీతాలు వచ్చేవి. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలని ప్రయత్నాలు చేయగా సాంకేతిక లోపంతో సాధ్యపడలేదు. ఈ క్రమంలో 2024 ఆగస్ట్ నుంచి జీతాలు రావడం లేదు. అసలే అంతంతమాత్రం జీతాలతో ఉన్న వీరు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ ప్రయోజనం చేకూరలేదు. సంబంధిత అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రంగనాయకులపేట రైలు వీధిలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి (40) పూటుగా మద్యం తాగి రహదారిపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు 52వ వార్డు రెవెన్యూ సెక్రటరీ నరేంద్రబాబుకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. గుర్తుతెలియని వ్యక్తి అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. నరేంద్రబాబు ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

పొదల్లో అస్థిపంజరం లభ్యం

ఆత్మకూరు: నెల్లూరు – ముంబై జాతీయ రహదారి అల్లీపురం అడ్డరోడ్డు వద్ద పొదల్లో మానవ అస్థిపంజరాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు ఎస్సై ఎస్కే జిలానీ కథనం మేరకు.. అల్లీపురం అడ్డరోడ్డు నుంచి కొద్దిదూరంలో ఉన్న పొదల్లో మృతదేహం పూర్తిగా దెబ్బతిని అస్థిపంజరం స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. కాగా ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి చెందిన డాక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చనిపోయిందని పురుషుడని, వయసు 55 నుంచి 60 సంవత్సరాల్లోపు ఉండొచ్చని డాక్టర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా శివశంకర్

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చెందిన కొత్తూరు శివశంకర్‌రెడ్డిను జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కామాక్షితాయి హుండీ రాబడి రూ.37 లక్షలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో బుధవారం దేవదాయ, శాఖ ఆధ్వర్యంలో హుండీ కానుకల్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఈ సంవత్సరం జనవరి నుంచి మార్చి 26వ తేదీ వరకు హుండీ కానుకల లెక్కింపును చేపట్టామన్నారు. ప్రధాన ఆలయ హుండీల ద్వారా రూ.34,74,137, అన్నదానానికి రూ.2,26,012లను భక్తులు సమర్పించడం జరిగిందన్నారు. బంగారు 96 గ్రాములు, వెండి 240 గ్రాములు, యూఎస్ డాలర్లు నాలుగు, యూఏఈ డాలర్లు 10, సింగపూర్ డాలర్స్ 20 సమర్పించారని వివరించారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు ఎస్.శ్రీధర్ నాయుడు, విద్యాసాగర్‌కృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతా గాలి లెక్కలే..


మాట్లాడుతున్న మేయర్ స్రవంతి


బడ్జెట్ సమావేశంలో ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

- రూ.695.95 కోట్లతో 2025 – 26 కార్పొరేషన్ బడ్జెట్
- తప్పుడు లెక్కలు చూపారని వైఎస్సార్‌సీపీ నిలదీత
- అధికార పార్టీ కార్పొరేటర్ల నుంచీ ప్రశ్నల వర్షం
- నీళ్లు నమిలిన కొందరు అధికారులు
- మధ్యలో వెళ్లిపోయిన కొందరు టీడీపీ కార్పొరేటర్లు


టీడీపీ కార్పొరేటర్లు వెళ్లపోవడంతో ఖాళీగా కుర్చీలు

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో అదిగో అభివృద్ధి.. ఇదిగో అభివృద్ధి అంటూ అధికార పార్టీ నాయకులు ఆర్భాటంగా చెబుతున్నారు. కానీ 2025 – 26 బడ్జెట్‌ను చూస్తే అంకెల గారడీ తప్ప ఇంకేం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.695.95 కోట్ల బడ్జెట్ గాలి లెక్కలేనంటూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నిలదీయగా.. టీడీపీకి చెందిన కొందరు కూడా అధికారులను ప్రశ్నించారు. ఇరువర్గాలు ప్రశ్నల వర్షం కురిపించగా అధికారులు లెక్కలను పూర్తి స్థాయిలో వివరించడంలో విఫలమయ్యారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నగరపాలక సంస్థలో ఈ పరిస్థితి నెలకొనడం చర్చనీయాంశమైంది.

అడ్డుపడుతూ..

కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం మొదలైంది. మొత్తం బడ్జెట్‌ను రూ.695.95 కోట్లతో రూపొందించగా, ప్రణాళికా వ్యయం రూ.448.52 కోట్లు ఉండగా, ప్రణాళికేతర వ్యయం రూ.247.43 కోట్లుగా ఉంది. సమావేశం ప్రారంభమయ్యాక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, వేలూరు మహేష్, మొయిళ్ల గౌరీలు ప్రజా సమస్యలపై మాట్లాడే క్రమంలో కొందరు టీడీపీ కార్పొరేటర్లు అడ్డుపడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.

ఉడాయించిన టీడీపీ కార్పొరేటర్లు

సమావేశం ప్రారంభమయ్యాక 12 గంటలకు పదిమందికి పైగా టీడీపీ కార్పొరేటర్లు ఉడాయించారు. తమ డివిజన్లలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు వారికి ఓపిక లేకుండా పోయిందని విమర్శలు వస్తున్నాయి. జనసేన నేత, కో–ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున్ యాదవ్ సమావేశానికి ఆలస్యంగా వచ్చి కేవలం పదినిమిషాలు మాత్రమే ఉండి అరుపులు, కేకలతో కొంతసేపు హడావుడి చేసి నెమ్మదిగా జారుకున్నారు. కొందరు ఆయన తీరుపై విస్మయం వ్యక్తం చేశారు.

జిరాక్స్‌కు అంత మొత్తమా..

2024 – 25 సంవత్సరానికి కార్పొరేషన్‌లో స్టేషనరీ కోసం రూ.రూ.40 లక్షలు ఖర్చు చేసినట్లు బడ్జెట్ లెక్కలు చూపడంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నిలదీశారు. అంత ఎందుకు అవుతుందని అడగ్గా అధికారులు నీళ్లు నమిలారు. అదేవిధంగా జిరాక్స్ కోసం రూ.20 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో జిరాక్స్ మెషీన్లు లేవని, బయట తీసుకుంటున్నామని చెప్పారు. దీంతో కార్పొరేటర్లు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల కోట్ల రూపాయల బడ్జెట్ పెడుతుంటే కనీసం జిరాక్స్ మెషీన్లు కూడా కొనుగోలు చేయలేకపోతున్నారా అని నిలదీశారు. బడ్జెట్‌లో మేయర్ పేషీకి 2023 – 24లో రూ.2,50,000 ఖర్చు చేసినట్లు చూపారు. 2024 – 25కు వచ్చేసరికి ఆ మొత్తం రూ.8 లక్షలకు పెరిగిందని, అంతలా దేనికి ఖర్చు చేశారని టీడీపీ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. దీని విషయంలో అధికారులు లెక్కలు చెప్పడంలో తడబడ్డారు. కాగా కర్తం మాట్లాడుతూ తన డివిజన్‌లో తాగునీటి సమస్య ఉందన్నారు. నగర ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించలేకపోతున్న ఇంజినీరింగ్ శాఖపై చర్యలు తీసుకోవాలని ప్లకార్డు ప్రదర్శించారు.

వారు సైతం..

టీడీపీ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి మాట్లాడుతూ పన్ను వసూళ్లలో అధికారుల తీరు బాగోలేదని, దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని చెప్పుకొచ్చారు. కార్పొరేటర్ రామకృష్ణ మాట్లాడుతూ వీధిలైట్లు వెలగలేదని ఏఈకి చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పన్ను చెల్లించకపోతే కరెంట్, వాటర్ కట్ చేస్తామని ఉద్యోగులు ప్రజలను బెదిరిస్తున్నట్లు తెలిపారు. మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ పన్ను వసూళ్లలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం బడ్జెట్‌ను ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో కమిషనర్ సూర్యతేజ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదు

నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు గతేడాది రూ.70 లక్షలు ఖర్చుచేసినట్లు చూపారు. రానున్న రోజుల్లో రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చూపారు. నగరంలో ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదు. బడ్జెట్‌లో మాత్రం అంకెల గారడీ చూపారు. 46వ డివిజన్‌లో ఓ సచివాలయంలో ప్రింటర్ చెడిపోయి మూడు నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– వేలూరు మహేష్, కార్పొరేటర్

అధికారుల తీరు మారాలి

ప్రజలు ఎన్నుకున్న కార్పొరేటర్లకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. డివిజన్లలో జరిగే అభివృద్ధి పనులను సైతం కార్పొరేటర్ల దృష్టికి తీసుకురావడం లేదు. అధికారులు తీరు మార్చుకోవాల్సి ఉంది. అదేవిధంగా బడ్జెట్ మొత్తం ఊహాజనితంగా ఉంది. సరైన లెక్కలు చూపలేదు. డిపార్ట్‌మెంట్ నుంచి కచ్చితమైన లెక్కల్లేవు. గతేడాదితో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువ చూపారు. అవినీతి జరిగే అవకాశం ఉంది.

– బొబ్బల శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్

చిరు వ్యాపారులపై భారం



రెవెన్యూ అధికారులు చిరు వ్యాపారులపై కమర్షియల్ ట్యాక్స్ పేరుతో భారం మోపుతున్నారు. డిమాండ్ నోటీసులు కూడా ఇవ్వకుండా పన్నులు చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారు. బోర్డుల్లేని వ్యాపారులు కూడా ట్రేడ్ లైసెన్స్ కట్టాలని అధికారులు భారం మోపుతున్నారు.

– మొయిళ్ల గౌరీ, కార్పొరేటర్

చర్యలు తీసుకోవాలి




మందుల కొనుగోళ్లకు గత సంవత్సరం రూ.5 లక్షలు ఖర్చు చేశారు. రానున్న ఏడాదిలో రూ.15 లక్షల ఖర్చు చేస్తామని చూపించారు. పారిశుద్ధ్య కార్మికులకు మందులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి

– సత్తార్, కార్పొరేటర్

ఏపీఐఐసీకి షుగర్ ఫ్యాక్టరీ భూములు

- సీఎంను కోరిన కలెక్టర్ ఆనంద్


సదస్సులో మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యను కలెక్టర్ ఆనంద్ సీఎం చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాకు సంబంధించిన అంశాలను సీఎంకు వివరించారు. చాలా ఏళ్లుగా చక్కెర కర్మాగారం మూతబడి ఉందన్నారు. నెల్లూరుకు సమీపంలో పెన్నానది ఒడ్డునున్న ఈ ఫ్యాక్టరీకి చెందిన 124 ఎకరాలను పరిశ్రమల స్థాపనకు ఏపీఐఐసీకి అప్పగించేందుకు అనుమతి మంజూరు చేయాలని విన్నవించారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ రైతులు, కార్మికులకు సంబంధించిన రూ.28 కోట్ల బకాయిల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి బకాయిలు చెల్లించి, పరిశ్రమల స్థాపనకు భూమిని ఏపీఐఐసీకి అప్పగించాలని జిల్లా ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ను ఆదేశించారు. సోమశిల ప్రాజెక్ట్ అభివృద్ధి పనుల్ని మొదలుపెట్టినట్లు కలెక్టర్ తెలిపారు. రామాయపట్నం పోర్టు వద్ద పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ఆగస్ట్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు 500 ఎకరాల భూమి సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు జాలర్ల అక్రమ ప్రవేశాలు, దాడుల సమస్యను కలెక్టర్ సీఎంకు వివరించారు.

కార్మికులు జాగ్రత్తగా ఉండాలి

నెల్లూరు(పొగతోట): జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రోజుల్లో వేసవి తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. పనిచేసే ప్రదేశంలో తప్పనిసరిగా ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల మధ్య కార్మికుల చేత పనిచేయించకూడదన్నారు. నిబంధనల్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కండలేరులో 49.386 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 49.386 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.75 సన్నవి : రూ.55
పండ్లు : రూ.30

29న నెల్లూరు బార్ అసోసియేషన్ వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా హైకోర్టు జడ్జి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ వార్షికోత్సవ కార్యక్రమం ఈనెల 29వ తేదీ శనివారం సాయంత్రం 6.30కు జిల్లా కోర్టు ఆవరణలో జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసులురెడ్డి, విశిష్ట అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి విచ్చేస్తారన్నారు. న్యాయవాదులు పాల్గొని వేడుకల్ని విజయవంతం చేయాలని కోరారు.

48 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 48 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జేసీ కె.కార్తీక్ తెలిపారు. బుధవారం 3,300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లుగా ప్రకటన విడుదల చేశారు. రూ.100.9 కోట్లు రైతులకు చెల్లించినట్లు వెల్లడించారు.

పదిమంది విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వీసీ తదితరులు

వెంకటాచలం: ఈనెల 28వ తేదీన గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయిలో జరిగే వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ – 2025 కార్యక్రమానికి పదిమంది విద్యార్థులను ఎంపిక చేశారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పదిమందిని ఎంపిక చేయగా బుధవారం వీసీ అల్లం శ్రీనివాసరావు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినందించారు.